క్లుప్తంగా

ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా లక్ష్మీప్రసన్న


బాధ్యతలు చేపట్టిన లక్ష్మీప్రసన్న

ఎస్‌.రాయవరం : మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో ఇన్‌చార్జ్‌ ప్రిన్సిపాల్‌ లక్ష్మీప్రసన్న శుక్రవారం బాధ్యతలు చేపట్టినట్టు కన్వీనర్‌ ప్రిన్సిపాల్‌ వెంకటరెడ్డి తెలిపారు. గతంలో ఉన్న ప్రిన్సిపాల్‌ పలు సమస్యలకు కారణం కావడంతో మంత్రి ఆదేశాలతో, అధికారులు సస్పెండ్‌ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు శ్రీకాకుళం జిల్లాలో బీసీ వెల్ఫేర్‌ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్న ఈమెకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించినట్టు వెంకటరెడ్డి తెలిపారు.

ఘనంగా అడవిరాజులబాబు పండగ

కోటవురట్ల : మండలంలోని కె.తంగేడు, యండపల్లి తదితర గ్రామాల్లో అడవిరాజుల పండుగను వైభవంగా జరిపారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

జ్యోతిబా పాఠశాలలో సదుపాయాల కల్పనకు చర్యలు


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కృష్ణమోహన్‌

ఎస్‌.రాయవరం : లింగరాజుపాలెంలో మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో విద్యార్థులకు సదుపాయాలు కల్పనకు సత్వరమే చర్యలు చేపట్టినట్టు బీసీ వెల్ఫేర్‌ సొసైటీ సెక్రటరీ ఎ.కృష్ణమోహన్‌ అన్నారు. మంత్రితో పాటు వచ్చి సమస్యలు తెలుసుకున్న ఆయన శుక్రవారం మరోమారు పాఠశాలను సందర్శించారు. అప్పటికే సర్వసిద్ధి పీహెచ్‌సీ సిబ్బంది ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని సందర్శించారు. విద్యార్థులు ఏ సమస్యకు వత్తిడి గురికాకూడదని సూచించారు. పాఠశాల విద్యాబోధనపై కూడా ఉపాధ్యాయులతో మాట్లాడారు.

21న మండల సర్వసభ్య సమావేశం

రాంబిల్లి : ఈ నెల 21 మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ఎస్‌.కొండలరావు తెలిపారు. ఎంపీపీ జి.శిరీష అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి


మెలిపాకలో పర్యటిస్తున్న మండల ప్రత్యేకాధికారి మంజులావాణి

మునగపాక : జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలని మండల ప్రత్యేకాధికారి మంజులావాణి కోరారు. మండలంలోని మెలిపాకలో ఆమె శుక్రవారం సాయంత్రం హౌసింగ్‌ డే లో భాగంగా జగనన్న కాలనీలో పర్యటించారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చే సాయాన్ని వినియోగించు కోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామన్నారు. ఆమె వెంట ఈవోఆర్డీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగు.. నేలతల్లి బాగు


గోపాలపట్నంలో ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ

పాయకరావుపేట : గోపాలపట్నం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సాగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నవధ్యాన్యాల సాగు – నేలతల్లి బాగు అనే నినాదంతో రైతులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి సిహెచ్‌.లచ్చన్న హాజరై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాలు పండించడంపై కలుగు లాభాలు, భూసారం పెరుగుదల రైతులకు పంటల వల్ల కలిగే లాభాలు తదితర అంశాలపై అవగాహనా ర్యాలీలో సర్పంచ్‌ పన్నీరు బాబ్జి, ఈవోఆర్‌డీ సిహెచ్‌.చంద్రశేఖర్‌, సచివాలయ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నాలుగు పర్వదినాలు కలసివచ్చిన రోజు

నేడే మహాశివరాత్రి

నక్కపల్లి : హరహర మహాదేవ శంభో శంకరా, ఓం నమఃశ్శివాయ అంటూ మహాశివరాత్రి పర్వదినాన బోళాశంకరుడ్ని దర్శించుకుందుకు భక్తులు సిద్ధమవుతున్నారు. మహేశ్వరుడు లింగాకారంలో ఉద్భవించిన మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో ఆయనను పూజించడానికి శైవక్షేత్రాలను ముస్తాబు చేస్తున్నారు. శనివారం మహాశివరాత్రి పర్వదినం. ఈ ఏడాది వచ్చిన శివరాత్రికి విశిష్టత ఉంది. మాస శివరాత్రి, శనివారం, శని త్రయోదశి, మహాశివరాత్రి నాలుగు పుణ్యదినాలు కలిసి రావడంతో భక్తులంతా శివాలయాలను సందర్శించి పరమేశ్వరుడ్ని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు చేయించుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఉపమాకలో ప్రాచీన శివాలయం లక్ష్మణేశ్వరస్వామి ఆలయం, గొడిచర్ల శేషలింగేశ్వర ఆలయం, ఒడ్డిమెట్టలో కాశీవిశ్వేరాలయంలో శివరాత్రి పూజలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. తెల్లవారు జామున మూడు గంటల నుంచే భక్తులను దర్శనాలకు అనమతిస్తారు. లింగోద్భవ సమయంలో మహాన్యాస పూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం, ఏలినాటి శని ఉన్నవారికి శని త్రయోదశి, మాస, మహాశివరాత్రి, శనివారం కలిసి రావడంతో రుద్రాభిషేకం, శనీశ్వరుడికి పూజలు చేస్తారు. స్వామిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు ఉపమాక శివాలయం చైర్మన్‌ వెంకటేశ్వరరావు, ప్రధానార్చకులు వెలవలపల్లి మహేష్‌ తెలిపారు.

ఎస్‌.రాయవరం : మండలంలో శివ జాగరణకు శివాలయాలు ముస్తాబు అయ్యాయి. దార్లపూడి శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి, పెదగుమ్ములూరు, పెనుగొల్లు, వేమగిరి గ్రామాల్లో శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి, పెదఉప్పలం బ్రహ్మలింగేశ్వరస్వామి సర్వసిద్ధి సిద్ధి లింగేశ్వరస్వామి, ఎస్‌.రాయవరం శ్రీ బుర్రేశ్వరస్వామి ఆలయాల్లో శివరాత్రి జాగరణ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. శివాలయాల సమీప గ్రామాల భక్తులు ఉదయం రేవుపోలవరం తీరంలో సముద్ర స్నానం ఆచరించి ఉపవాసాలు ఉంటూ, రాత్రికి శివునికి రుద్రాభిషేకాలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఇందుకు పాలకమండలి, దాతలు దేవాలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు.


ఉపమాకలో ఉన్న శివాలయం


రామలింగేశ్వరస్వామి


వాడ్రాపల్లి దక్షిణేశ్వర ఆలయంలోని శివలింగం


సర్వాంగ సుందరంగా దార్లపూడి శివాలయం


నాగులాపల్లిలోని పురాతన శివాలయం


శివపార్వతుల విగ్రహాలు

మునగపాక : మునగపాకలోని లింగరాయిగుడి,సాంబశివుని ఆలయాల్లో శివరాత్రి పర్వదిన సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వాడ్రాపల్లి దక్షిణేశ్వరుని ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడంతో ఆలయ కమిటీ తగు ఏర్పాట్లు చేశారు. స్వయంభూ శివలింగం కావడంతో శివరాత్రికి భక్తులు తరలిరానున్నారు. నాగులాపల్లిలోని మెయిన్‌రోడ్డు సమీపంలో పురాతన శివాలయంలో ఉదయం నుంచి రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నారు. సిరసపల్లిలోని వీరభద్రస్వామి ఆలయం, మెలిపాకలో శివాలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. పలు చోట్ల రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పంచదార్లలో..

రాంబిల్లి: మహా శివరాత్రి పూజలకు శివాలయాలు సిద్ధమయ్యాయి. జిల్లాలో ప్రసిద్ధి చెందిన పంచదార్ల పుణ్యక్షేత్రంతో పాటు, దిమిలిలో చారిత్రక స్వయంభూ నగ్న లింగేశ్వరస్వామి, గోకివాడలో స్వయంభూ శివలింగం సహా వెల్చూరు, కట్టుబోలు, మురకాడ, కొత్తపట్నం తదితర గ్రామాల్లో శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు.

హరిగిరి కొండపై..

అచ్యుతాపురం(అనకాపల్లి): హరిపాలెం గ్రామంలో హరిగిరి కొండపై శ్రీవరహా నరసింహ జియ్యాత్‌ ఆధ్వర్యంలో శనివారం శివరాత్రి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. కొండపై శివలింగానికి అదేరోజు 12 గంటల వరకు అభిషేకాలతోపాటు ప్రత్యేక పూజలు నేత్రపర్వంగా జరగనున్నాయి.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


క్రీడాకారులను అభినందిస్తున్న ఏపీ గవర కార్పొరేషన్‌ చైర్మన్‌ ప్రసాద్‌

మునగపాక : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఏపీ గవర కార్పొరేషన్‌ చైర్మన్‌ బొడ్డేడ ప్రసాద్‌ పిలుపునిచ్చారు. మండలంలోని నారాయుడుపాలెం గ్రామానికి చెందిన కరాటే కోచ్‌ శివ సారథ్యంలో ఇటీవల పలువురు విద్యార్థులు అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. ఈ మేరకు శుక్రవారం శివతో పాటు పలువురు క్రీడాకారులు గవర కార్పొరేషన్‌ చైర్మన్‌ ప్రసాద్‌ను కలిశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పలు పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపడం వెనుక కోచ్‌ శివ ప్రోత్సాహం ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మునగపాక ఉత్సవ కమిటీ చైర్మన్‌ బొడ్డేడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సత్వరం పూర్తి చేయాలి


సమావేశంలో సిబ్బందిని వివరాలు అడుగుతున్న ప్రత్యేక అధికారి

పాయకరావుపేట : మండలంలో గల ఆయా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు సత్వరమే పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి సిహెచ్‌.లచ్చన్న అన్నారు. మండల పరిషత్‌ ఆవరణలో గల స్త్రీ శక్తి భవన్‌లో అధికారులతో సమావేశమయ్యారు. నిర్మాణంలో వున్న రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, హెల్త్‌ సెంటర్లు, ఇంటింటికి తాగు నీరు సరఫరా, జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణాలు చురుగ్గా జరగాలని సంబంధిత అధికారులకు సూచించారు. శాఖల వారీగా అధికారులను అభివృద్ధి పనుల పురోగతిపై వివరాలు అడిగి తెల్సుకున్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం


కళాశాల ప్రిన్సిపాల్‌ శంకర్‌

నర్సీపట్నం: నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్‌ శంకర్‌ శుక్రవారం తెలిపారు. అర్థశాస్త్రం సబ్జెక్టు ఆంగ్ల మాధ్యమంలో బోధించాలని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై నెట్‌/స్లెట్‌ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు విద్యా అర్హత, భోదన అనుభవానికి సంబంధించి ఒరిజినల్‌ ధ్రువీకరణ పత్రాలతో పాటు జెరాక్స్‌ సెట్‌తో డెమో క్లాస్‌నిర్వహించడానికి ఈ నెల 20న ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు.

చదరంగం పోటీలకు విశేష స్పందన


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మాకవరపాలెం: గౌతమి లలిత కళా శిక్షణ కేంద్రం నిర్వహించిన చదరంగం పోటీలకు విశేష స్పందన లభించింది. స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఈ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజేతలకు ఉగాది నాడు బహుమతులు అందజేస్తామని నిర్వాహకుడు పి.రంగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌతమి లలిత కళా శిక్షణ కేంద్రం కార్యదర్శి శేషగిరిరావు పాల్గొన్నారు.

నేడు అక్కమ్మ పేరంటాల తీర్థం

మాడుగుల రూరల్‌: తాటిపర్తి పంచాయతీ శివారు కాశీపురంలో అక్కమ్మ పేరంటాలు తీర్థాన్ని శనివారం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన జరపనున్నట్టు చెప్పారు.

హాస్టళ్లలో విస్తృత తనిఖీలు


నక్కపల్లి హాస్టల్లో తనిఖీలు చేస్తున్న ఎంపీడీవో, ఎంఈవోలు


పాటిపల్లి కస్తూర్బా స్కూల్‌ను సందర్శిస్తున్న మండల ప్రత్యేకాధికారి మంజులావాణి


పాయకరావుపేట బాలుర వృసతి గృహాలను తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి లచ్చన్న


కోటవురట్లలోని వసతి గృహంలో సమస్యలు తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ

నక్కపల్లి : ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు కదిలారు. మండల కేంద్రంతో పాటు, గొడిచర్లలో ఉన్న బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎస్‌.రాయవరం మండలం లింగరాజుపాలెంలో జ్యోతిబాపూలే పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ విద్యార్థులు ఆందోళన చేసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం స్పందించింది. మండలాల్లో ఉన్న వసతి గృహాలన్నింటిని తనిఖీలు చేసి సమస్యలు గుర్తించడంతోపాటు, వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ రవిపట్టాన్‌శెట్టి ఆదేశించడంతో శుక్రవారం నక్కపల్లి ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈవో డీడీ ప్రసాద్‌లు నక్కపల్లి, గొడిచర్లలో ఉన్న వసతి గృహాలను తనిఖీ చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, వాడుకనీటి సమస్యలను గుర్తించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. వెంటనే వార్డెన్‌తో మాట్లాడి తక్షణమే విద్యార్థులు చెప్పిన సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. వారం రోజుల్లోగా ఈ సమస్యలన్నింటిని పరిష్కరించాలని ఆదేశించారు. వసతి గృహాల్లో మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలన్నింటినీ కల్పించాలని సూచించారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన

నక్కపల్లి బాలుర వసతి గృహంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం తహసీల్దార్‌ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. బీసీ వసతి గృహానికి సొంత భవనం నిర్మించాలని కోరారు.

మునగపాక : ప్రతి పాఠశాలలోనూ మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి మంజులావాణి పేర్కొన్నారు. మండలంలోని పాటిపల్లి మోడల్‌ స్కూల్‌, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను శుక్రవారం ఆమె సందర్శించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బాత్‌రూమ్‌లు, టాయ్‌లెట్లు ఉన్నాయా లేదా పరిశీలించారు. నీటి సదుపాయంపై ఆరా తీశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సదుపాయాలు కల్పించాలని, మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌ల సంఖ్య అవసరమైతే పెంచాలని కోరారు. ఆమె వెంట ఈవోఆర్డీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

వసతి గృహాల్ని పరిశీలించిన ప్రత్యేక అధికారి

పాయకరావుపేట : పట్టణంలో గల వసతి గృహాలను మండల ప్రత్యేక అధికారి సిహెచ్‌.లచ్చన్న శుక్రవారం పరిశీలించారు. బాలికల వసతి గృహం, బాలుర వసతి గృహాల్లో విద్యార్థులకు మరుగుదొడ్లు, తాగునీరు, మౌలిక సదుపాయాలు ఏవిధంగా వున్నాయో వసతి గృహ వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా విద్యార్థులను సౌకర్యాలు, సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల వార్డెన్లలకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రత్యేక అధికారి లచ్చనతో పాటు ఈవోఆర్‌డీ చంద్రశేఖర్‌, డిప్యూటీ తహసీల్దార్‌ నూకరాజు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల సందర్శన

రాంబిల్లి: రాంబిల్లిలో కస్తూర్బా పాఠశాలను శుక్రవారం ఎంపీడీవో కె.ఎస్‌.కొండలరావు, ఎంఈవో ఎం. సూర్యారావు సందర్శించారు. జిల్లా కలెక్టర్‌ ఆదేశాల మేరకు కస్తూర్బా పాఠశాలను సందర్శించినట్లు ఎంఈవో తెలిపారు. ఆర్‌వో ప్లాంట్‌ మరమ్మతులు చేపట్టాలని, చేతిబోరు వేయాలని విద్యార్థినులు, ఉపాధ్యాయులు కోరడంతో వాటికి ప్రతిపాదనలు పంపుతామని ఎంపీడీవో హామీ ఇచ్చారు.

వసతి గృహాల్లో సమస్యల గుర్తింపు

కోటవురట్ల: మండలంలోని ప్రభుత్వ వసతి గృహాలను మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ శుక్రవారం తనిఖీ చేశారు. వసతి గృహాలలో పలు సమస్యలను గుర్తించి నివేదికను తయారు చేశారు. సమస్యలు ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రత్యేకాధికారి తెలిపారు. స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో గదులు పూర్తిగా శిథిలమై పెచ్చులూడుతున్నట్టు గుర్తించారు. మరుగుదొడ్లకు తలుపులు ఊడిపోయాయి, ప్రహరీ కూడా శిథిలమైంది. విద్యుత్‌ సమస్యలు ఉన్నాయి. ఇంటిగ్రేటెడ్‌ బాలుర వసతి గృహంలో కూడా పలు సమస్యలను గుర్తించినట్టు ప్రత్యేకాధికారి తెలిపారు. వాటర్‌ ట్యాంకు శిథిలం కావడంతో ప్లాస్టిక్‌ ట్యాంకు అవసరం ఉన్నట్టు తెలిపారు. కేజీబీవీలో వసతులు సక్రమంగా ఉన్నాయని తెలిపారు.

కార్మికుల బకాయిల కోసం మంత్రికి వినతి


మంత్రి రాజాను కలిసిన కార్మిక సంఘం నాయకులు

పాయకరావుపేట : తాండవ చక్కెర కర్మాగారం కార్మికుల బకాయిలు చెల్లించేందుకు కృషి చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాకి చక్కెర కర్మాగారం కార్మికులు విన్నవించారు. మంత్రి రాజా స్వగృహంలో (ఎస్‌.అన్నవరం గ్రామంలో) కార్మికులు కలిసి ప్రభుత్వం నుంచి కార్మికులకు విడుదల కావలసిన రూ.10 కోట్లు విడుదలకు కృషి చేయాలని విన్నవించారు. అదే విధంగా ఫ్యాక్టరీ మరలా క్రషింగ్‌ జరిగే విధంగా కృషి చేయలని విన్నవించారు. మంత్రి రాజా స్పందించి కార్మికుల బకాయిలు ఏప్రిల్‌లో విడుదల జరిగే విధంగాను, ఫ్యాక్టరీ మరలా క్రషింగ్‌ జరిగే విధంగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు కార్మిక సంఘం ప్రతినిధులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కార్మిక సంఘం ప్రతినిధులు శ్రీనివాసరాజు, రఘురామరాజు, వెంకటరమణ, సాల్మన్‌రాజు వున్నారు.

ఎమ్మెల్యేను సత్కరించిన సోషల్‌ మీడియా కన్వీనర్లు


ఎమ్మెల్యే బాబూరావును సత్కరిస్తున్న సోషల్‌ మీడియా బృందం

కోటవురట్ల : వైఎస్సార్‌సీపీ సోషల్‌ మీడియా కన్వీనర్లు కొల్లి గోపాలకృష్ణ, పెన్నాడ అప్పలరాజు, గణశాల శ్రీనివాస్‌, శానాపతి ప్రసాద్‌, చిందాడ వెంకట రమణ తదితరులు ఎమ్మెల్యే గొల్ల బాబూరావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వీరంతా ఎమ్మెల్యేను కొరుప్రోలులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలుసుకుని ఘనంగా సత్కరించారు. అనంతరం కోటవురట్లలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజును, జెడ్పీటీసీ ఉమాదేవిని కలుసుకుని సత్కరించారు.

మైహోమ్‌ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం


విద్యార్థులకు మందులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

యలమంచిలి : ఉచిత వైద్య శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మైహోమ్‌ సిమెంట్‌ ఫ్యాక్టరీ జనరల్‌ మేనేజరు బి.రామస్వామి అన్నారు. శుక్రవారం యలమంచిలి మండలంలో పులపర్తి, గూండ్రుబిల్లి, లక్కవరం, కృష్ణాపురం గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 268 మంది విద్యార్థులకు వైద్యబృందంతో ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మైహోమ్‌ సీనియర్‌ డీజీఎం ఎల్‌.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల ఆరోగ్య సమస్యలు తీర్చడానికి ఫ్యాక్టరీ ద్వారా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ సాంబమూర్తి, డాక్టర్‌ ప్రియ, డాక్టర్‌ నరేష్‌కుమార్‌, ఎల్‌.వి. ప్రసాద్‌ కంటి ఆస్పత్రి వైద్య బృందం, ఉపాధ్యాయులు, ఫ్యాక్టరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలి


విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ అందజేస్తున్న ఉదయ్‌తేజ, సర్పంచ్‌ సత్యనారాయణ

ఎస్‌.రాయవరం : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని తిమ్మాపురం సర్పంచ్‌ కర్రి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపురం సీనియర్‌ ఉపాధ్యాయులు కర్రి ధర్మారావు కుమారుడు కర్రి ఉదయ్‌తేజ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ నారాయణపట్నం ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు అందజేశారు. సుమారు రూ.8 వేలు విలువ చేసే పుస్తకాలు 30 మంది విద్యార్థులకు అందజేసి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుర్రం నానాజీ, బొండా దివాణం పాల్గొన్నారు.

‘ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి’


తహసీల్దార్‌ రమాబాయికి వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్‌ నేతలు

అచ్యుతాపురం(అనకాపల్లి): ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలంటూ స్థానిక తహసీల్దార్‌ కార్యాలయం ముందు ఏపీటీఎఫ్‌ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం నిరసన తెలియజేశారు. ఈ మేరకు తహసీల్దార్‌ రమాబాయికి వినతిపత్రం అందజేశారు. సీపీఎస్‌ రద్దు చేయాలని, ఉపాధ్యాయులకు 1వ తేదీన జీతాలు చెల్లించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సన్యాసినాయుడు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.నాగేశ్వరావు, బేతా శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన మరిడిమాంబ జాతర


అమ్మవారి గరగలను ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్‌ : స్థానిక విజయరామరాజుపేట శ్రీ మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం గురువారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలతో ఘనంగా ముగిసింది. అమ్మవారి గరగలను పేట పురవీధుల గుండా మేళతాళాల మధ్య ఊరేగించారు. రాత్రి ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన స్టేజ్‌ ప్రోగ్రాంలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ ఆళ్ల శివరామ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పలకా రాము, వైస్‌చైర్మన్‌ బొబ్బిలి అప్పారావు, కోశాధికారి పిట్ల బుడ్డేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఉగ్గిన నర్సింగరావు, భక్తులు పాల్గొన్నారు.

టెన్త్‌లో జిల్లా ప్రథమ స్థానం సాధించాలి


డీఈవోకు డైరీని అందజేస్తున్న ఏపీటీఎఫ్‌ నాయకులు

అనకాపల్లిటౌన్‌ : జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రాష్ట్ర ఏపీటీఎఫ్‌ ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్‌ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, యూనియన్‌ డైరీని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతి పరీక్షలో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కొత్తగా ఏర్పడిన జిల్లాలో ఈ ఏడాది పదోతరగతి ఫలితాల్లో ప్రథమస్థానం సాధించాలని లక్ష్యనిర్దేశం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఏపీటీఎఫ్‌ ప్రధాన కార్యదర్శి ఎస్‌.సన్యాసినాయుడు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు వడ్డాది వెంకన్న పెళ్లిరాట

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలకు శనివారం పెళ్లిరాట వేస్తున్నట్టు ఆలయ వంశపారం పర్య ధర్మకర్త దొండా కన్నబాబు,ఆలయ ఈవో శర్మ తెలిపారు. ఇక్కడ ఐదు రోజుల పాటు కల్యాణ మహోత్సవాలు కమనీయంగా జరుగుతాయి. లక్షలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు.